# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైల్వే ప్లాట్‌ఫాం టికెట్లతో పాటు ప్రైవేటు వసతి గృహాలను వస్తు, సేవల పన్ను నుంచి మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 40 వేల 336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి జి.రవికుమార్ తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో కాలుష్య నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.**
4. **తెలంగాణను వైద్య సేవలకు కేంద్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
5. **టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన గ్రూప్-1 సూపర్-8 మ్యాచ్‌లో భారత జట్టు బంగ్లాదేశ్ పై విజయం సాధించింది.**

===========================

రైల్వే ప్లాట్‌ఫాం టికెట్లతోపాటు విద్యా సంస్థల బయట ఉండే ప్రైవేటు వసతి గృహాలను వస్తు, సేవల పన్ను జీఎస్టీ నుంచి మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన వస్తు, సేవల పన్ను జీఎస్టీకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నిన్న జరిగింది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి జీఎస్టీ కౌన్సిల్ సమావేశమైంది. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు సహా పలు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, అధికారులు హాజరయ్యారు. సమావేశానంతరం మంత్రి పాత్రికేయులకు వివరాలను వెల్లడించారు. అన్ని పాల క్యాన్లపై జీఎస్టీని 12శాతంగా, కార్టన్ బాక్సులపై 18 శాతం నుంచి 12శాతానికి పన్నును తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు. పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోని తీసుకొచ్చే విషయంలో రాష్ట్రాలదే కీలక పాత్రని, అవి రేటును నిర్ణయించాక అమల్లోకి తెస్తామని స్పష్టం చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాలు నిన్నటితో ముగిశాయి. ఈ సమావేశాల్లో నూతనంగా ఎంపికైన శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేయగా, ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభాపతిగా అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికై నూతన సభాపతిగా అయ్యన్న పాత్రుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ, స్పీకర్ పదవి అనేది ఒక

భాధ్యతయుతమైనదని అని అన్నారు. సభా మర్యాదలను కాపాడుతూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేదిశగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సహా ఇతర మంత్రులు, శాసనసభ్యులు అభినందనలు తెలియచేస్తూ ప్రసంగించారు. అనంతరం శాసన సభ సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు సభాపతి అయ్యన్న పాత్రుడు ప్రకటించారు. దీంతో రెండురోజులపాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కొత్తగా 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి జి. రవికుమార్ తెలిపారు. నిన్న వెలగపూడి సచివాలయంలో ఆయన ఇంధనశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దస్త్రంపై తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యుత్ సరఫరా.. డిమాండ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. దేశంలోనే అత్యుత్తమంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖను తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు దశలవారీగా సౌర విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తామనిచెప్పారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా ఇంటింటికీ 3 కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కాలుష్య నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. నిన్న విజయవాడలో పర్యావరణ, అటవీ అంశాలపై సంబంధిత అదిఆరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని కాలుష్య నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలు, జిల్లాలవారీగా జల, వాయు, కాలుష్యాల వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి తీరాల్లో పరిశ్రమల నుంచి వస్తున్న జల కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎర్ర చందనం అక్రమ రవాణా అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ ను బలోపేతం చేస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

---------------------------

తెలంగాణను వైద్య సేవలకు కేంద్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వార్షికోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ, బసవతారకం ఆసుపత్రి లక్షలాది మందికి సేవలందిస్తోందని, క్యాన్సర్ ను అరికట్టాలనేది గొప్ప ఆలోచన అని అన్నారు. శంషాబాద్ సమీపంలో మెడికల్ హబ్‌గా పెద్ద ఆస్పత్రులు నిర్మిస్తామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడాలని ఆకాంక్షిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు విదేశాలలో లేపాక్షి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. నిన్న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ –లేపాక్షి ఎంపోరియంను సందర్శించి కళాకృతులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, సాంప్రదాయ కళాకృతులు లేపాక్షి ఎంపోరియంలో అందుబాటులో ఉంటాయన్నారు. హస్తకళాకారులకు జీవనోపాధి కల్పించి ఆధునాతన కళాకృతులను వినియోగదారులకు అందించేల చర్యలు

తీసుకుంటామని తెలుపుతూ,

వాయిస్ ...(27 సెకన్లు)

---

న్యాయవాదులు ఎప్పటికప్పుడు కొత్త చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. జులై 1నుంచి అమలులోకి రానున్న మూడు కొత్త చట్టాలపై తెలంగాణ రాష్ట్ర న్యాయ అకాడమీ న్యాయవాదులకు హైదరాబాద్‌లో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ ప్రారంభించి మాట్లాడుతూ, నూతన చట్టాలకు అనుగుణంగా న్యాయవాదులకు అవసరమైన జ్ఞానాన్ని అందించడానికి శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. యువ న్యాయవాదులకు చట్ట నిబంధనలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి జాతీయస్థాయి గుర్తింపు లభించింది. పాస్పోర్ట్ సేవలను అందించడంలో అత్యుత్తమ పనితీరు కనబరరిచినందుకు గానూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. నిన్న ఢిల్లీలో జరిగిన ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారుల సదస్సులో కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ప్రశంసాపత్రాన్ని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారులు అందుకున్నారు.

---

తెలంగాణవ్యాప్తంగా ప్రకృతి పర్యాటకం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కొండా సురేఖ తెలిపారు. తెలంగాణ ప్రకృతి పర్యాటక విధానం రూపకల్పనకు మంత్రి అధ్యక్షతన సంప్రదింపుల కమిటీ నిన్న హైదరాబాద్ సచివాలయంలో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో అటవీ, అటవీయేతర ప్రాంతాలు కలిపి మొత్తం 12 ప్రకృతి పర్యాటక సర్క్యూట్లను ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. గుర్తించిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటకుల వసతుల కల్పనకు ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రకృతి పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు.

---

ఈ రోజు అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రీడలను అభివృద్ధి చేయడం, మన జీవితంలో క్రీడలు ఒక భాగమనే అంశాన్ని బలంగా వ్యాప్తి చేయడం, ఎక్కువ మంది క్రీడలలో పాల్గొనేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం నిర్వహణలోని ముఖ్యోద్దేశం. అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ పిలుపుమేరకు ప్రతి ఏటా జూన్ 23వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. మొదటిసారి ఒలంపిక్ దినోత్సవాన్ని 1948లో నిర్వహించారు.

---

టీ20 క్రికెట్ ప్రపంచకప్ లో భాగంగా నిన్న జరిగిన గ్రూప్–1 సూపర్–8 మ్యాచ్‌లో భారత జట్టు బంగ్లాదేశ్ పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. అనంతరం 197 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేయగా 50 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూ ధరలను సవరించినట్టు పలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవమనిపై తిరుమల తిరుపతి దేవస్థానం–టిటిడి ఒక ప్రకటనలో పేర్కొంది.తిరుమల వెంకటేశ్వర స్వామి వారి 3 వందల రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శనం, 50 రూపాయల లడ్డూ ప్రసాదం ధరల్లో ఎలాంటి మార్పు లేదని టిటిడి అధికారులు స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం కోసం దళారులను సంప్రదించొద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

========================